సాక్షి వరంగల్

సోమవారం | 9 | జూన్ | 2025



ఇందిరమ్మ ఇళ్లు.. శ్లాబ్‌లు పడేదెప్పుడు!

ఇందిరమ్మ లబ్ధిదారుల తుది జాబితా కొలిక్కిరాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపంతో లబ్ధిదారుల ఎంపికలో ఆలస్యం అవుతుంది. - 8లో▸



పంట అవశేషాలు కాల్చొద్దు!

వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు కోతలు పూర్తయ్యాక పంట అవశేషాలను కాల్చొద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38^0/29^0

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రతతో ఉక్కపోత ఉండి, రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

సైకోల వీరంగం



గీసుకొండ: మండలంలోని పలు గ్రామాల్లో సైకోలు ప్రవేశించి వీరంగం సృష్టిస్తున్నారు. ఆయా గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల క్రితం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పని కోసం వచ్చిన ఓ వ్యక్తి గీసుకొండ గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలోకి వెళ్లి పడుకున్నాడు. గమనించిన ఇంటి కుటుంబ సభ్యులు అతడిని బయటకు పంపించడానికి ప్రయత్నించగా వారిపై దాడి చేయబోయాడు. కొద్ది రోజుల క్రితం రాంపురం గ్రామానికి వెళ్లిన ఓ వ్యక్తి హిందీలో మాట్లాడుతూ పిచ్చిగా ప్రవర్తిస్తూ గ్రామస్తులపై దాడికి యత్నించాడు. స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండల పరిధిలోని టెక్స్‌టైల్ పార్కు, గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలు మద్యం, గుట్కా, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై సైకోలుగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. అలాంటి వారిపై పోలీసులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'కాల్పుల విరమణపై మోదీ వివరణ ఇవ్వాలి'

నర్సంపేట: భారత్, పాక్‌లకు వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని చెప్పి కాల్పుల విరమణకు ఒప్పించినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనలపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గ్రీన్ రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో సీహెచ్.రంగయ్య మాట్లాడారు. ట్రంప్ జోక్యంతో కాల్పుల విరమణ జరగడంపై దేశ ప్రజలు అవమానంగా భావిస్తున్నారన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ ఖండించకపోవడం సందేహాలకు తావిస్తోందని తెలిపారు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి విషయంలో రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు, ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి ఆపరేషన్ సిందూర్ విషయంలో మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. పహల్గాంలోపై ప్రధాని పార్లమెంట్ సమావేశం నిర్వహించి ఎంపీల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే భారత్ నాలుగవ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ప్రధాని మోదీ నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పడాన్ని తప్పు పట్టారు. ఆపరేషన్ కగార్‌ను కొనసాగించడం దారుణం అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ నెరవేర్చాల్సిందేనన్నారు. కార్యక్రమంలో బాబు, బాబు, కుమారస్వామి, సమ్మయ్య, స్వామి, కుమార్, శ్రీధర్, బషీర్, సాంబయ్య, దుర్గయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో చండీహోమం



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో ఆదివారం ఉదయం అర్చకులు చండీహోమం నిర్వహించారు. అమెరికా దేశం డల్లాస్‌లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐ రేవతి గత శనివారం 53 గ్రాములు, 57 గ్రాముల కలిగిన రెండు బంగారు కాసుల హారాలను కానుకగా శ్రీభద్రకాళి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా రేవతి దంపతులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి చండీహోమంలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

11 నుంచి బీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి బీపీఈడీ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 11 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11, 13, 16, 18 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

న్యూశాయంపేట : కలెక్టరేట్‌లో సోమవారం (నేడు) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాలతో రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కీలక పోస్టులు ఖాళీ

అస్తవ్యస్తంగా గ్రేటర్ వరంగల్ పరిపాలన

- ఉన్నవారిపై పెరుగుతున్న పనిభారం
- కొరవడిన పర్యవేక్షణ.. అభివృద్ధి పనుల్లో లోపిస్తున్న నాణ్యత
- కట్టుతప్పుతున్న కట్టడాలు



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అధికారుల కొరత వేధిస్తోంది. కీలక విభాగాల్లో అధిపతులు లేకపోవడం.. పరిపాలనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నగరాభివృద్ధికి అత్యంత కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండటం, మరికొందరు అధికారులకు అదనపు బాధ్యతలను అప్పగించడంతో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యమవుతోంది. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు చాలా విషయాల్లో చొరవ తీసుకోకుండా దాట వేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. దీంతో పరిపాలన గాడి తప్పుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్రంలో రెండో రాజధానిగా గ్రేటర్ వరంగల్‌కు గుర్తింపు ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 8,19,469 మంది జనాభా ఉండగా, ప్రస్తుతం 12లక్షల పైచిలుకు పెరిగినట్లు అంచనా. కొత్త కాలనీలు వెలుస్తుండడంతో జనాభా రెట్టింపవుతోంది. నగరం రోజు రోజుకూ వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకెళ్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇక్కడే వరుసగా వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. సమగ్ర కుటుంబ సర్వే, మన వార్డు–మన ప్రణాళిక, ఆసరా పింఛన్లు, ఆహార భద్రత కార్డుల తదితర పథకాల దరఖాస్తుల స్వీకరణ, సర్వే, సంక్షేమ పథకాల పంపిణీ పనుల్లో అధికారులు, సిబ్బంది బిజీబిజీగా ఉంటున్నారు. దీంతో బల్దియా ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో నగర ప్రజలకు సకాలంలో సేవలు లభించడం లేదు. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించే నగర పాలక సంస్థ వింగ్ అధికారుల కొరతతోపాటు సరిపడా క్షేత్రస్థాయి సిబ్బంది లేమితో నగర పరిపాలన నత్తనడకన కొనసాగుతోంది.

రెండు ఎస్‌ఈల పోస్టు ఖాళీ

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావాలన్నా, తాగునీటి సరఫరా సవ్యంగా సాగాలన్నా ఎస్‌ఈ అవసరం. ఒక ఎస్‌ఈ 8 నెలల కిందట బదిలీపై వెళ్లారు. మరో ఎస్‌ఈ గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఈఈ శ్రీనివాస్‌కు ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా బాధ్యతలు ఇచ్చారు. ఆయన కూడా రెండు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీంతో ఎస్‌ఈ పోస్టులకు దిక్కుమొక్కు లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏఈల కొరత బల్దియాను వెంటాడుతోంది. ఒక్కొకరికి రెట్టింపు డివిజన్లను కట్టబెట్టారు. పెరిగిన నగర విస్తీర్ణం దృష్ట్యా 25 మంది ఏఈలు ఉండాలి. కానీ, అరకొర మందితో నెట్టుకొస్తున్నారు. వెరసి అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు కరువై మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. దీంతో ప్రజాధనం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డిప్యూటీ కమిషనర్ పోస్టులు ఖాళీలు:

కీలకమైన మూడు విభాగాల్లో డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. అందులో కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్ ప్రసునారాణికి కొత్తగా ఏర్పాటైన కేసముద్రం మున్సిపాలిటీకి, కాజీపేట డిప్యూటీ కమిషనర్‌కు స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీకి ఇన్‌చార్జ్ కమిషనర్లుగా నియమించారు. ఇలా అదనపు బాధ్యతలతో అధికారులు తమ కొలువులకు న్యాయం చేయలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని నగరవాసులు కోరుతున్నారు.

సిటీ ప్లానర్ పోస్టు ఖాళీ..

నగర అభివృద్ధిలో కీలక విభాగమైన పట్టణ ప్రణాళిక సిటీ ప్లానర్ పోస్టు తొమ్మిది నెలలుగా ఖాళీగా ఉంది. డిప్యూటీ సిటీ ప్లానర్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. రెండు డీసీపీ పోస్టులు, మరో రెండు ఏసీపీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాక 25 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకుగాను కేవలం 15 మందితో నడుస్తోంది. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత వీరిది. క్షేత్రస్థాయి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తక్కువ మంది ఉండడంతో ఉన్న వాళ్లకే ఎనిమిది డివిజన్లు, విలీనగ్రామాల పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. అంతేకాక ఉన్న వారిలో సగం మందికి పైగా జిల్లాలోని మునిసిపాలిటీలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు సకాలంలో ఇవ్వలేకపోతున్నారు.

'మూడో మంత్రి'పై ఆశలు ఆవిరి!

ఫలించని ఓరుగల్లు సీనియర్ నేతల ప్రయత్నాలు

- డిప్యూటీ స్పీకర్‌తోనే సరిపెట్టిన పార్టీ అధిష్టానం
- విప్ నుంచి డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రునాయక్
- శాఖలను పదిలం చేసుకున్న మహిళా మంత్రులు
- ఊహాగానాలకు తెర దింపిన హైకమాండ్



రామచంద్రునాయక్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఓరుగల్లు నేతలకు ఆదివారం నాటి రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కలేదు. దీంతో మూడో మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేసిన సీనియర్ల ఆశలు ఆవిరయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో ఉమ్మడి వరంగల్ నుంచి ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించింది. బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్కలకు రేవంత్‌రెడ్డి కేబినేట్‌లో స్థానం దక్కింది. సుమారు 16 నెలల తర్వాత మళ్లీ మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో మూడో మంత్రి కోసం పలువురు సీనియర్లు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది.

ఆశావహులకు నిరాశ

మంత్రివర్గ విస్తరణ చాలా కాలం నుంచి వాయిదా పడుతుండగా.. చివరకు శుక్రవారం పార్టీ హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో మంత్రివర్గంలో చోటు కోసం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్.. ఇలా ఎవరికి తోచిన దారిలో వారు అగ్రనేతలతో ప్రయత్నాలు చేశారన్న ప్రచారం ఉంది. ప్రధానంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఈసారి మంత్రి వర్గంలో చోటు దక్కుతుందన్న ప్రచారం జరిగింది. 2014లో టికెట్ దక్కకున్నా ఇండిపెండెంట్‌గా గెలుపొందిన మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీకే ప్రాధాన్యత ఇచ్చారు. 2023లో కాంగ్రెస్ టికెట్‌పైన గెలిచిన ఈయనకు మొదటి మంత్రివర్గ విస్తరణలో అవకాశం ఉంటుందని ఆశించినా జరగలేదు. ఈసారి కూడా తనకు మంత్రివర్గంలో చోటివ్వాలని కోరినా దక్కలేదు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సీనియర్ నేత, మాజీ మంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా తీవ్రంగా ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, నాయకుడిగా పార్టీని వదలకుండా ఉన్న తనకు కూడా అవకాశం ఇవ్వాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పార్టీ పెద్దలకు తన వాయిస్ వినిపించారు. మాజీ ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఎస్సీ సామాజిక వర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని అడిగినట్లు ప్రచారం. అయితే ఉమ్మడి వరంగల్ నుంచి ఆశించిన ఎవరికీ అమాత్యపదవి దక్కక పోవడం కొంత నిరాశ పర్చింది.

అమాత్యుల శాఖలు పదిలం

మంత్రివర్గ విస్తరణలో ఈసారి కనీసం నలుగురి అవకాశం ఉంటుందని భావించినా.. ముగ్గురికే అవకాశం ఇచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి పదవి కోసం ప్రయత్నించిన మరో ఎమ్మెల్యే, గిరిజన సామాజిక వర్గానికి చెందిన డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రానున్న కాలంలో తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తామని ఆయనకు హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి డిప్యూటీ స్పీకర్ పదవితో సరిపెట్టినట్లు సమాచారం. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా విస్తరణ సందర్భంగా జిల్లాకు చెందిన ఇద్దరు మహిళా మంత్రులకు చెందిన శాఖల మార్పులు, చేర్పులు ఉంటాయన్న ప్రచారం జరిగింది. ప్రస్తుతం మంత్రి సీతక్క పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి(గ్రామీణ నీటిసరఫరా సహా), మహిళా శిశుసంక్షేమ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొండా సురేఖ అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రిగా ఉన్నారు. కొత్తగా ప్రమాణం చేసిన మంత్రులకు ఆదివారం రాత్రి వరకు శాఖలు కేటాయించలేదు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల శాఖల్లో కూడా మార్పులు చేర్పులు జరగలేదు. దీంతో మంత్రుల శాఖలు మారతాయనేది ఉత్త ప్రచారమని తేలిపోయింది.

ముందుగా సాగుచేస్తే అధిక దిగుబడి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఖిలా వరంగల్: వరి పంటను ముందుగా సాగు చేయడం వల్ల తెగుళ్లు, చీడపీడల ప్రభావం తగ్గి అధిక దిగుబడి వస్తుందని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర సందర్భంగా ఆదివారం నర్సంపేట మండలం ముగ్ధుంపురం గ్రామంలో మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు అమలు, కేంద్ర ప్రయోజిత పథకాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయాన్ని పోత్సహిస్తూ, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. వ్యవసాయంతోపాటు పశుపోషణ, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మెట్ట పంటల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. బీడు భూముల్లో సాగు చేయదగిన పంటలు, నీరు తక్కువ ఉన్న భూముల్లో నీటి కుంటల ప్రాముఖ్యత, డ్రిప్, స్పింక్లర్ సేద్యం ద్వారా నీటి సమర్థవంతమైన వినియోగం గురించి వివరించారు. అధిక నీటిని వినియోగించే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యసాయ అధికారి అనురాధ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడి రకాల వివరాలతోపాటు, శాశ్వత సాగు కోసం రైతులు వ్యవస్థాత్మకంగా ప్రణాళిక చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వీరన్న, ఏడీఏ దామోదర్‌రెడ్డి, వ్యవసాయాధికారి కృష్ణకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట/ దుగ్గొండి/ఖానాపురం: ప్రజాప్రభుత్వం ద్వారానే పేదల సొంతింటి కల నెరవేరుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని పలు వార్డులు, చెన్నారావుపేట మండలం కేంద్రంతోపాటు అక్కల్‌చెడ(కట్టాయపల్లి), దుగ్గొండి మండలంలోని వెంకటాపురం, రేబల్లె, ఖానాపురం మండలంలోని బండమీది మామిడితండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆదివారం భూమి పూజలు చేసి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దశాబ్ద కాలం తర్వాత నివాసం లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం హర్షనీయం అన్నారు. గత ప్రభుత్వ పాలకుల నిర్వాకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. గత పాలకులు నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్రూం కూడా నిర్మించలేక పోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఇళ్లు రాలేదని బాధపడాల్సిన అవసరం లేదని, త్వరలోనే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. హౌసింగ్ డీఈ విష్ణువర్ధన్, నర్సంపేట మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బాబు, రాజేశ్వర్‌రావు, రామారావు, రామానంద్, హరిబాబు, జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సునీల్‌కుమార్, వెంకటప్రసాదరావు, రాజేందర్, సాంబయ్య గౌడ్, విజయ్‌కుమార్, నరేందర్, యాకుబ్‌రెడ్డి, రజనీభారతి, సందీప్, రవికుమార్ పాల్గొన్నారు.

రెస్క్యూ.. సెవెన్ అవర్స్!

- ఆరుగురు విద్యార్థుల మృతదేహాలు లభ్యం
- తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాలింపు
- మృతులందరివీ సాధారణ కూలీ కుటుంబాలే
- తల్లిదండ్రుల రోదనలతో దద్దరిల్లిన బ్యారేజీ పరిసర ప్రాంతాలు
- ప్రాణాలు తీసిన ఈత సరదా.. సెల్ఫీలపై ఆసక్తి!



మేడిగడ్డ వద్ద గోదావరిలో గాలింపు చర్యలు

కాళేశ్వరం: సమీప బంధువు వివాహ వేడుకలకు హాజరై.. సరదా కోసం ఈతకు వెళ్లి గల్లంతైన ఆరుగురు విద్యార్థుల మృతదేహాలను ఏడు గంటల పాటు రెస్క్యూ సెర్చ్ ఆపరేషన్‌లో వివిధ బృందాల గాలింపుతో పోలీసులు త్వరగా కనుగొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోవివాహ వేడుకలు ముగిసిన తర్వాత సమీపంలోని మేడిగడ్డ బ్యారేజీ చూద్దామని సరదాగా శనివారం సాయంత్రం ఆరు గంటలకు సొంత ఆటోలో పట్టి వెంకట్‌స్వామి అతడి ఇద్దరు కుమారులు, మరో ఐదుగురితో కలిసి వెళ్లారు. మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ అప్‌స్ట్రీమ్ మూడో బ్లాక్ వద్ద గోదావరి లోతు ప్రాంతంలో ఈతకు దిగిన ఏడుగురిలో ఆరుగురు గల్లంతయ్యారు. ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు.

అన్నీ కూలీ కుటుంబాలే..



కుమారుల చెప్పులు, బెల్టు పట్టుకొని కన్నీరు పెడుతున్న వెంకట్‌స్వామి

అంబట్‌పల్లికి చెందిన పట్టి వెంకట్‌స్వామి–యశోద దంపతులకు ఇద్దరు కుమారులు పట్టి మధుసూదన్(18) డిగ్రీ, చిన్న కుమారుడు పట్టి శివమనోజ్(15) (పదో తరగతి పూర్తి), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన ఆటో నడుపుతూ.. వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. ఇద్దరు కుమారులు కళ్ల ముందే నీటిలో మునిగి కొట్టుకుపోతుండగా రక్షించే ప్రయత్నం చేసినా ఫలించకపోవడంతో ఇద్దరు మృతిచెందారు. పిల్లల చెప్పులు, బెల్టులు పట్టుకొని తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కలిచివేసింది.

కవలల్లో ఒకరు మృతి

అంబట్‌పల్లికి చెందిన సమ్మయ్యకు కుమారుడు కర్నాల సాగర్(16), స్రవంతి కవలలు. వారిద్దరూ ఇంటర్ చదువుతున్నారు. సాగర్ మృతి చెందడంతో సోదరి కన్నీటి ధారలతో వీడ్కోలు పలికింది. వారిదీ కూలీ కుటుంబమే.

కొడుకు మరణంతో..

మల్హర్ మండలం మల్లారానికి చెందిన తొగరి రాజయ్య–సాంబ దంపతుల కుమారుడు తొగరి రక్షిత్(13) 9వ తరగతి చదువుతున్నాడు. వారు అంబట్‌పల్లిలోనే నివాసం ఉంటున్నారు. కూలీ పని చేస్తూ జీవించే వీరికి కుమార్తె కూడా ఉంది. రక్షిత్ మృత్యువాత పడడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి సాంబ రోదనలు మిన్నంటాయి.

7 గంటల్లో ఇలా..

ఆదివారం ఉదయం 5గంటలకు రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభమైంది. మొదట 5.41 గంటలకు తొగరి రక్షిత్, 6.50 గంటలకు పసుల రాహుల్, 9.45 గంటలకు కర్నాల సాగర్, 10.07 గంటలకు మధుసూదన్, 11.16 గంటలకు రామ్‌చరణ్, 11.45 గంటలకు శివమనోజ్ మృతదేహాలను వెలికితీశారు. ఏఎస్పీ నరేశ్‌కుమార్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సైలు పవన్‌కుమార్ పర్యవేక్షించారు. మృతదేహాలను అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట డీటీ కృష్ణ, ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ సురేశ్ ఉన్నారు.

వివాహ వేడుకలకు వచ్చి..



రోదిస్తున్న రాహుల్ తండ్రి శ్రీనివాస్

మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పీపీ)కి చెందిన పసుల శ్రీనివాస్–లక్ష్మీ దంపతుల చిన్న కుమారుడు రాహుల్(19) డిగ్రీ చదువుతున్నాడు. వివాహ వేడుకలకు వచ్చి రాహుల్ మృతిచెందడంతో తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ ఏడ్చారు. వారు కూడా కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

కుమారుడి మృతితో..

మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెద్దల వెంకటయ్య–స్వర్ణ దంపతుల పెద్ద కుమారుడు రామ్‌చరణ్(17) డిగ్రీ చదువుతున్నాడు. వీరు వ్యవసాయ కూలీలు.. వారికి చిన్న కుమారుడు ఉన్నాడు. రామ్‌చరణ్ మృతిచెందడంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదం అలుముకుంది.

అన్నా.. అంటూ నీటిలోకి..

పట్టి వెంకట్‌స్వామి చిన్న కుమారుడు శివమనోజ్ నీటిలోకి దిగి అన్నా..అన్నా అని పిలుస్తూ లోతుకు జారుకుంటున్నాడు. ఆక్రమంలో ఒడ్డున ఉన్న అన్న మధుసూదన్ తమ్ముడిని పట్టుకొని కాపాడేందుకు ప్రయత్నం చేసి అతడు కూడా నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనలో పట్టి మధుసూదన్‌ను కాపాడే ప్రయత్నంలో పట్టి శివమణి (18) కూడా నీటిలోకి దిగి చివరి నిమిషంలో ప్రాణాలతో బయటపడ్డాడు.

సెల్ఫీలతోనే..

ఈతకు వెళ్లిన ఏడుగురు విద్యార్థులు స్నానాలు చేస్తూ సెల్ఫీలు దిగారు. ఆ క్రమంలోనే జారి లోతు ప్రవాహంలో పడినట్లు తెలిసింది. దీంతో ఒకరిని కాపాడే క్రమంలో మరొకరు అంతా గల్లంతై మృత్యువాత పడ్డారని తెలిసింది.

ముమ్మర గాలింపు..

ఆదివారం తెల్లవారుజామున ఉదయం 5 నుంచి 12 గంటల వరకు రెస్క్యూ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. భూపాలపల్లి ఏఎస్పీ నరేష్‌కుమార్, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌డీఆర్‌ఎఫ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, డీడీఆర్ఎఫ్, ఫైర్, స్థానిక, సిరొంచ జాలర్లు, సింగరేణి రెస్క్యూ టీంలు స్పీడ్ బోట్లు, నాటు పడవల సాయంతో ముమ్మరంగా గాలించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు సాగిన రెస్క్యూ ఆపరేషన్‌లో ఆరుగురి మృతదేహాలు వెలికి తీశారు. అంబులెన్స్‌ల ద్వారా మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతుల కుటుంబాలకు అప్పగించారు. ఆస్పత్రి ప్రాంగణమంతా ఆర్తనాదాలతో మార్మోగింది.

రాత్రి ఫలించని రెస్క్యూ ఆపరేషన్..

శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఘటన జరగడంతో హుటాహుటిన కదిలిన అధికారులు లైటింగ్ ఏర్పాటు చేసి కొంతమేర లోతుకు వెళ్లి పరిశీలించి రాత్రి 11.50గంటలకు వరకు వేచి చూసి నిలిపివేశారు. శనివారం గోదావరి ప్రవాహం 5,100 క్యూసెక్కులు ఉండగా, ఆదివారం 4,500 క్యూసెక్కులకు తగ్గింది.

రూ.10లక్షలు పరిహారం చెల్లించాలి : మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరిశీలించారు. ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్యారేజీకి మరమ్మతులు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి వదిలేశారని, నీటిని నిల్వ చేసి కాపలా ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని అన్నారు. ఆరుగురు మృతి ఘటనకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబే కారణమని ఆరోపించారు.

మృగశిర సందడి

నర్సంపేట/సంగెం/నర్సంపేట రూరల్: మృగశిర కార్తె ప్రారంభంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా చేపల విక్రయాలు జోరుగా సాగాయి. మృగశిర సందర్భంగా చేపలను తింటే ఆరోగ్యానికి మేలనే నమ్మకంతో ప్రజలు చేపల కొనుగోళ్లపై ఆసక్తి చూపారు. ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో పలుచోట్ల వ్యాపారస్తులు చేపల ధరలు పెంచి విక్రయించారు.



సంగెంలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



నర్సంపేటలో..

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● వడిచర్ల సమీపంలో ఘటన


వినయ్ (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని జనగామ–సూర్యాపేట రోడ్డులో వడిచర్ల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన ముదుగులోజు వినయ్ (27) దుర్మరణం చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వినయ్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై జనగామ వెళ్తున్నాడు. వడిచర్ల సమీపంలోని పీవీఆర్ పాఠశాల మలుపు వద్ద జనగామ నుంచి సూర్యాపేట వైపునకు వెళ్తున్న డీసీఎం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, వినయ్ మూడు నెలల క్రితమే వివాహం చేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

నర్సింగాపురంలో బైక్‌పై నుంచి పడి మరో యువకుడు..


కుమార్ మృతదేహం

కొడకండ్ల : బైక్ అదుపు తప్పడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని నర్సింగాపురం శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కోమటిగూడెం గ్రామానికి చెందిన గూడెల్లి కుమార్(38) బైక్‌పై కొడకండ్ల మండలానికి వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో కొడకండ్ల –పాలకుర్తి రహదారిపై నర్సింగాపురం శివారులో బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అశ్విని, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్సై చింత రాజు ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు సేకరించారు.

వేములవాడలో ములుగు జిల్లా వాసి మృతి


రాజు(ఫైల్)

ములుగు రూరల్: వేములవాడలో ములుగు జిల్లా వాసి మృతి చెందాడు. మల్లంపల్లి మండలం భూపాల్ నగర్‌కు చెందిన సాద రాజు (32) ఈ నెల 5వ తేదీన బంధువులతో కలిసి వేములవాడ వెళ్లాడు. మూడు రోజులు అక్కడే ఉన్నాడు. ఆదివారం ఉదయం బంధువులు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో బంధువులు లక్ష్మీనరసింహ స్వామి గుడి ఆవరణలో వెతుకుతుండగా పక్కన ఉన్న కోనేరు వద్ద రాజుకు సంబంధించిన వస్తువులు కనిపించాయి. దీంతో కోనేరులో పడి ఉంటాడని భావించి స్థానికులతో కలిసి వెతకగా మృతదేహం లభించింది. వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని రాజు తండ్రి సమ్మయ్యకు అప్పగించినట్లు తెలిసింది. కాగా, రాజు మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



‘ఇందిరమ్మ’ ఇళ్ల శ్లాబ్‌లు పడేదెప్పుడు?

ఉమ్మడి వరంగల్‌లో లబ్ధిదారుల ఎంపిక, ప్రొసీడింగ్స్ జారీలో ఆలస్యం

- సమయం, సమన్వయలోపమే అసలు సమస్య..
- లబ్ధిదారుల ఎంపిక ప్రగతిని ఇటీవల విడుదల చేసిన అధికారులు
- జనగామలో 58.16 శాతం ప్రొసీడింగ్స్ జారీ.. 0.28 శాతానికే భూపాలపల్లి పరిమితం
- ములుగు జిల్లాలో పెరగని వేగం.. మానుకోట, వరంగల్‌లలో 35, 36శాతం
- 39.94 శాతంలో హనుమకొండ.. సమీక్ష తర్వాత మారిన పరిస్థితి
- నిర్మాణంపై దృష్టిసారించిన అధికారులు.. వేగం పెరిగితేనే సకాలంలో నిర్మాణం



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి పరిధిలోని సయ్యద్ నగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య, అధికారులు (ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాపై కసరత్తు జరుగుతూనే ఉంది. తుది జాబితా పూర్తిగా కొలిక్కిరాలేదు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమయం, సమన్వయం కుదరకపోవడమే కారణంగా చెబుతున్నారు. కొన్నిచోట్ల ఇళ్లు తక్కువ, ఆశావహులు ఎక్కువగా ఉండడంతో కలెక్టర్‌లు, ఎమ్మెల్యేలు ఎటూ తేల్చలేకపోతున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేయడం కోసం గత నెల 29న రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి వరంగల్‌కు చెందిన కలెక్టర్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని, ఈ నెల 6 నాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టాలని ఆదేశించారు. మంత్రి ఇచ్చిన గడువు ముగిసినా లబ్ధిదారుల ఎంపిక అధికారులు, ప్రజాప్రతినిధులు మల్లగుల్లాలు పడుతూనే ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికపై కొనసాగుతున్న కసరత్తు..

ఇందిరమ్మ కమిటీలతోపాటు అధికారులు పక్కాగా అర్హులను గుర్తిస్తున్నారు. ఎక్కడైనా అనర్హులకు ఇల్లు ఇస్తే అధికారులపై కఠిన చర్యలుంటాయని రాష్ట్ర మంత్రులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో లోపాలు లేకుండా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పర్యవేక్షిస్తున్నారు. గ్రామాలవారీగా వచ్చిన దరఖాస్తుల్లో ప్రాధాన్య క్రమంలో నిరుపేదలను గుర్తిస్తున్నారు. కాగా, గత నెల 29న వెల్లడించిన అధికారుల గణాంకాల ప్రకారం ఉమ్మడి వరంగల్‌కు 46,892 ఇళ్లు మంజూరు కాగా 38,551 ఇళ్లకు ఎంపీడీఓలు ఆమోదం తెలిపారు. ఇందులో 18,122లను ఆయా జిల్లాల కలెక్టర్‌లు ఆమోదించగా, 15,306 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇచ్చారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష తరావ్త ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచేందుకు కలెక్టర్లు లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసే పనులపై కసరత్తు చేస్తున్నారు.

ఇటీవల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సందర్భంగా విడుదల చేసిన లెక్కలు ఇలా...

జిల్లా	కేటాయింపు	ఎంపీడీఓలు ఆమోదించినవి	కలెక్టర్‌లు ఆమోదించినవి	ప్రొసీడింగ్స్ సిద్ధమైనవి	ప్రొసీడింగ్స్ సిద్ధమైన శాతం
హనుమకొండ	10,621	7,156	4,950	4,242	39.94
వరంగల్	11,459	7,080	3,422	2,979	36.00
జనగామ	6,202	5,183	3,667	3,607	58.16
మహబూబాబాద్	9,745	6,945	3,703	3,447	35.37
ములుగు	4,175	7,247	1,423	1,018	24.38
భూపాలపల్లి	4,690	4,940	957	13	0.28
మొత్తం	46,892	38,551	18,122	15,306	

జిల్లాల వారీగా స్పెషల్ టీమ్‌లు..

మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేలా జిల్లాల వారీగా స్పెషల్ టీమ్‌లు వేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సమీక్షిస్తూ ఈ నెల 15లోగా వీలైనన్ని ఎక్కువ ఇళ్లు నిర్మాణం దిశగా ముందుకు సాగేలా దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో లబ్ధిదారుల తీరుని పరిశీలించి ఆమోదముద్ర వేస్తున్నారు. గృహనిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులకు దిశానిర్దేశం చేస్తూ వీలైనంత తొందరగా వీటి నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరిస్తున్నారు. హనుమకొండలో 332 ఇళ్లు గ్రౌండింగ్ చేయగా, 156 బేస్మెంట్ లెవెల్‌కు చేరుకున్నాయి. వరంగల్‌లో 275 ఇళ్లకు 126, మహబూబాబాద్‌లో 287లకు 122, జనగామలో 405లకు 235, ములుగులో 595లకు 309, జేఎస్ భూపాలపల్లిలో 160 గ్రౌండింగ్ చేయగా, 68 బేస్మెంట్ లెవెల్‌కు చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో శనివారం నాటికి మొత్తంగా 82 ఇళ్ల వరకు స్లాబ్ లెవెల్‌కు చేరినట్లు అధికార వర్గాల సమాచారం.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేలా చూస్తున్నాం. ఓ వైపు మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ.. ప్రొసీడింగ్స్ జారీ, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగేలా చర్యలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులను కలిసి నిర్మాణాలకు ఎంత ఖర్చయిందని, నిర్మాణ సామగ్రిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారని తెలుసుకుంటున్నాం. పనుల పురోగతి, బిల్లుల చెల్లింపు జరిగేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది.

– పి.ప్రావీణ్య, జిల్లా కలెక్టర్, హనుమకొండ

టిప్పర్ ఢీకొని బాలిక మృతి


ఇందుమతి(ఫైల్)

పెద్దవంగర: ఈ లోకంలో ఆనందమంతా తనదే అన్నట్టు అప్పటి వరకు ఎంతో సంతోషంగా ఆడుకుందా చిన్నారి. సరదాగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిన బాలికను టిప్పర్ రూపంలో మృత్యువు బలిగొంది. రెక్కల కష్టంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కూతురుకి పదకొండేళ్లకే నూరేళ్లు నిండడంతో కన్నపేగు కన్నీటి పర్యంతమైంది. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం బావోజీతండా గ్రామ పంచాయతీ పరిధి కిష్టుతండాకు చెందిన జాటోతు అనిత –సోమన్న దంపతులకు ఇందుమతి(11), దీక్షిత్ ఇద్దరు సంతానం. ఇందుమతి ఐదో తరగతి పూర్తికాగా వేసవి సెలవులు కావడంతో ఇంటివద్దనే తమ్ముడితో ఉంటున్నది. తండ్రి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని నిమిత్తం వెళ్లగా.. తల్లి తమకు ఉన్న కొద్ది పాటి వ్యవసాయ పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఇందుమతి ఆడుకుంటూ సైకిల్ తొక్కేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తండా సమీపాన ఉన్న నేషనల్ హైవే 930పీ పక్కనే నిర్మాణంలో ఉన్న సర్వీస్ రోడ్డు మీదుగా దుర్గామాత ఆలయం వద్దకు సైకిల్‌పై వెళ్తుండగా రోడ్డు నిర్మాణ పనుల కోసం వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొటింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఇందుమతి అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై క్రాంతి కిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు

‘నేహ’కు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి
- కడసారిచూపునకు నోచుకోని తల్లి
- ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స


కూతురు మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి వెంకన్న

కురవి : మండల కేంద్రానికి చెందిన తొడుసు నేహ (15) శనివారం సాయంత్రం మండల కేంద్రం శివారు లింగ్యా తండా వద్ద 365 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తల్లి సరిత అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కూతురు నేహ మృతి చెందిన విషయం తల్లికి తెలియదు. ఈ క్రమంలో ఆదివారం నేహకు గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. అశ్రునయనాల మధ్య నేహ అంత్యక్రియలు పూర్తయ్యాయి. నేహ కడసారిచూపునకు నోచుకోకుండా తల్లి సరిత అచేతనావస్థలో కొట్టుమిట్టాడుతుండడంపై గ్రామస్తులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. నేహ అంత్యక్రియలకు సహ విద్యార్థినులు తరలొచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఎర్ర నాగేశ్వరరావు, రాజేందర్‌కుమార్, మాజీ డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, నూతక్కి నర్సింహరావు, సంగెం భరత్, బాదె నాగయ్య, మేక నాగిరెడ్డి, గుగులోత్ రవి, నూతక్కి సాంబశివరావు, దుడ్డెల వినోద్.. నేహ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. బిడ్డను చూసేందుకు వచ్చిన నాయకులను చూసిన తండ్రి వెంకన్న బోరున విలపించాడు. బిడ్డ నీకోసం సార్లు వచ్చారంటూ గుండెలవిసేలా రోదించాడు.

పంట అవశేషాలను కాల్చొద్దు..

కలియదున్నండి

- మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త మాలతి
- రైతులకు సూచనలు


మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామానికి వెళ్లే దారిలో కాలుతున్న పంట అవశేషాలు

మహబూబాబాద్ రూరల్ : వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు కోతలు పూర్తయ్యాక పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నాలని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ రైతులకు సూచిస్తున్నారు. దేశంలో ప్రతీ సంవత్సరం 500 నుంచి 600 మిలియన్ టన్నుల పంట అశేషాలు ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న నుంచి ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఇందులో 20 నుంచి 30 శాతం వరకు రైతులు కాల్చివేస్తున్నారని, తద్వారా పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. గ్రామాల్లో రైతుల స్థితిగతులు మారి పశువుల, మూగజీవుల పెంపకం తగ్గడం వల్ల పశుగ్రాసం వాడడం లేదన్నారు. ఈ అవశేషాలు ప్రధానంగా పంజాబ్, హరియాణా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అధికంగా కాల్చడం వల్ల వాటి పక్కన ఉన్న ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో భారీస్థాయిలో గాలి కాలుష్యం నమోదవుతోందని గుర్తు చేశారు. ఇక్కడ ప్రధాన సమస్య వరి, గోధుమ, మొక్కజొన్న, పప్పు దినుసు పంటలను కాల్చివేయడమని, తెలంగాణ రాష్ట్రంలో సగటున 30 నుంచి 40శాతం వరి, 90 నుంచి 95శాతం పత్తి అవశేషాలను కాల్చివేస్తున్నారన్నారు.

అవశేషాలను కాల్చడానికి ప్రధాన కారణాలు..

- మొదటి, రెండో పంట మధ్య వ్యవధి తక్కువ ఉండడం.
- అవశేషాలు కుళ్లడానికి అధిక సమయం పట్టడం.

కాల్చడం వల్ల కలిగే సమస్యలు..

- పర్యావరణ కాలుష్యం కాలుష్యకారకాలు సీఓ, సీఓ 2, ఎన్ 2 ఓ, ఎస్ ఓ 2 విడుదలవ్వడం.
- గాలి నాణ్యత తగ్గడం, భూసార క్షీణించడం, నత్రజని కర్బన స్థాయి తగ్గడం ఉపయోగకర సూక్ష్మజీవులు కీటకాలు చనిపోవడం.
- 5.5 కిలోల నత్రజనితోపాటు 2.3 కిలోల భాస్వరం 25 కిలోల పొటాషియం 1.2 కిలోల సల్ఫర్ నష్టం వాటిల్లుతుంది.

పంట అవశేషాల ఉపయోగాలు..

- పశువులకు మేతగా ఉపయోగించడం, వంటచెరుకుగా వాడడం.
- సేంద్రియ వ్యవసాయంలో కంపోస్టింగ్ కోసం పుట్టగొడుగుల సాగు కోసం ఉపయోగించొచ్చు.
- అవశేషాల నుంచి బయోఇథనాల్ ప్యాకింగ్ మెటీరియల్ కోసం ఉపయోగపడడం.
- నేలలో కలియదున్నడం వల్ల కర్బన స్థాయి పెరగడం, గాలిప్రసారం, భూభౌతిక లక్షణాలు పెరుగుతాయి.
- నేల మీద మల్చ్‌గా ఉపయోగించొచ్చు.

నేలలో కలియదున్నితే...

- నత్రజని 1.2 నుంచి 2 కిలోల వరకు, భాస్వరం 1 నుంచి 1.6 కిలోల వరకు, 12 నుంచి 13.6 కిలోల వరకు నేలకు అందించొచ్చు.

బయోచార్ తయారు చేసుకోవడం..

- పంట అవశేషాలను ట్రాక్టర్ బేలర్ సాయంతో వరిగడ్డిని చుట్టలుగా చుట్టుకోవచ్చు.
- గడ్డిత్వరగా కుళ్లడానికి వ్యర్థ డికంపోజర్ లేదా పూసా డికంపోజర్, పీజేటీఎస్‌ఏయూ కన్సార్టియం ద్వారా త్వరగా కుళ్ల బెట్టొచ్చు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న గిరిజనులు

- ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభంలో చేదు అనుభవం
- స్కూల్‌కు ఆన్‌లైన్‌లోనే అనుమతులు



నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు, మాజీ వార్డు కౌన్సిలర్


ఎమ్మెల్యే మురళీనాయక్ వాహనాన్ని అడ్డుకుంటున్న గిరిజనులు

మహబూబాబాద్ అర్బన్: గిరిజనుల భూముల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అక్రమంగా నిర్మాణం చేపట్టారని, ఆ స్కూల్ ప్రారంభానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను గిరిజనులు అడ్డుకున్నారు. మహబూబాబాద్ మున్సిపల్ శనిగపురం పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఆదివారం గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్‌నాయక్ మాట్లాడుతూ.. శనిగపురం రెవెన్యూ వీరారంతండాకు చెందిన మాజీ వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను కుటుంబానికి చెందిన(సర్వే నంబర్ 275, 278, 279లలో) సుమారు 30 ఎకరాల భూమిని డాక్టర్ జన్నపురెడ్డి ప్రమోద్‌రెడ్డి వారి అనుచరులతో కలిసి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రెవెన్యూ వ్యవస్థను తప్పుదోవ పట్టించారన్నారు. రెవెన్యూ ఉద్యోగులను, మున్సిపల్ ఉద్యోగులకు లంచాలు ముట్టజెప్పి అక్రమ మార్గంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రమోద్ హోమ్స్ పేరుతో గృహ నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ ప్రమోద్‌రెడ్డి గిరిజన భూములను సుమారు 30 నుంచి 60 ఎకరాలు కబ్జా చేసి ప్రస్తుతం ఆ భూముల్లో అనుమతులు లేకుండా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుతో(డీపీఎస్ పేరును కలిగి ఉన్న డ్యూప్లికేట్ లోగో) నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఆ స్కూల్ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేయగా ఆయన ఆదేశం మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం చేపట్టిన విచారణలోనూ ఫోర్జరీ డాక్యుమెంట్లతో భూములు అక్రమించినట్లు తేలడంతో డాక్టర్ ప్రమోద్‌రెడ్డి, అతడి అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని చెప్పారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీ స్పందించి భూములను అప్పగించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై డీఈఓ రవీందర్‌రెడ్డిని వివరణ కోరాగా ఆన్‌లైన్‌లో మాత్రమే ప్రారంభానికి అనుమతులు వచ్చాయని, ఆరు నెలల్లో అన్ని పత్రాలు సరైన రీతిలో అందజేస్తే అనుమతులు వస్తాయని తెలిపారు. అనంతరం ‘గోబ్యాక్ ఎమ్మెల్యే’ అంటూ గిరిజనులు నిరసన తెలిపడంతో ఎమ్మెల్యే మురళీనాయక్ వెనుతిరిగి వెళ్లిపోయారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య


గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

ఆత్మకూరు : గుర్తుతెలియని వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గుడెప్పాడ్ సమీపంలో చోటుచేసుకుంది. సీఐ సంతోశ్ కథనం ప్రకారం.. గుడెప్పాడ్ శివారులోని వ్యవసాయభూములకు వెళ్లే దారిలో ఓ వృద్ధుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు 70 నుంచి 80 ఏళ్లు ఉంటాడు. నీలి రంగు, తెలుపు గీతల హాఫ్ షర్టు, ఆకుపచ్చ రంగు గీతల గల్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి ఎడమ కనుబొమ్మ దగ్గర పులిపిరి ఉంది. మృతుడి వివరాలు తెలిస్తే సంతోశ్ (సీఐ) 8712685225 నంబర్, తిరుపతి(ఎస్సై) 8712685252 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రేఖియానాయక్ తండాలో వృద్ధురాలు..


ద్వాలి(ఫైల్)

సంగెం: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సంగెం మండలం పోచమ్మతండా పరిధిలోని రేఖియానాయక్ తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ ద్వాలి(70),నాను దంపతులకు నరసింహ, భద్రు సంతానం. నాను చాలా కాలం క్రితం చనిపోయాడు. పెద్ద కుమారుడు నరసింహ ఏడాదిన్నర క్రితం చనిపోయాడు. ద్వాలి చిన్న కుమారుడు భద్రు వద్ద ఉంటోంది. ద్వాలికి రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఎప్పటిలానే శనివారం రాత్రి అందరూ భోజనాలు చేసి నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున కోడలు రంగమ్మ లేచి కిచెన్‌లోకి వెళ్లి చూడగా ద్వాలి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించింది. మృతురాలి మనవడు వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్. నరేశ్ తెలిపారు.

రెడ్డిపాలెంలో కౌలు రైతు..

గీసుకొండ: అప్పుల బాధతో వరంగల్ 15వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు వరగాని సత్యం(40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం.. సత్యం కూలి పనులు చేస్తూ జీవించేవాడు. రెండేళ్ల నుంచి ఓ రైతు భూమిని కౌలుకు తీసుకు సాగు చేయగా పంటల దిగుబడి సరిగా రాకపోవడంతో పాటు అతడి భార్య వైద్య ఖర్చులు, పిల్లల చదువులు మొత్తం కలిపి రూ. 6 లక్షల అప్పు అయింది. ఈ అప్పు తీర్చలేని స్థితిలో ఈ నెల 1వ తేదీన పురుగుల మందుతాగాడు. గమనించిన బంధువులు వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ ఆదివారం తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి

కుటుంబీకులు, బంధువుల ఆరోపణ

- సంరక్ష ఆస్పత్రి ఎదుట ఆందోళన
- ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన విరమింజేసిన పోలీసులు


రమణ (ఫైల్)

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈవిషయం తెలిసిన వెంటనే ఏసీపీ నందిరామ్‌నాయక్.. మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్, స్పెషల్ పోలీసులతో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనకారులకు నచ్చచెప్పడంతో వారు ఆందోళన విరమించి మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచర్లకు చెందిన కొత్తపెల్లి రమణ (28) కాంగ్రెస్ పార్టీ యూత్ లీడర్‌గా కొనసాగుతున్నాడు. శనివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ద్విచక్రవాహనంపై నగరానికి వచ్చాడు. పనులు ముగించుకుని అనంతరం ఇంటికి బయలుదేరాడు. మొగిలిచర్ల గ్రామంలోని ప్రధాన రహదారిపై రాత్రి 11.30 గంటల సమయంలో గూడ్స్ వాహనం.. బైక్‌ను వెనక నుంచి ఢీకొంది. దీంతో రమణ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన బంధువులు 108లో రమణను వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడని వైద్యులు పేర్కొన్నారు. ఈవిషయం తెలిసి మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే (వైద్యం వికటించడంతోనే) తమ కుమారుడు మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఆసత్రి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ నందిరామ్ నాయక్.. వైద్యులు, బంధువులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. అనంతరం గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో మృతుడి తండ్రి కొత్తపెల్లి భిక్షపతి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.


ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, కుటుంబీకులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ వరంగల్, మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కి కేవలం 5 కి.మీ. దూరంలో KUDA approved Layout Plots. గజం 8,999/- మాత్రమే. EMI సౌకర్యం కలదు. సెల్: 9573689941 [WA-7568]

SERVICES

రెస్టారెంట్

■ హోటల్ విహార గ్రాండ్: NGO's కాలనీ రోడ్, హన్మకొండ. టిఫిన్స్, రెస్టారెంట్, ఐస్ క్రీమ్స్, లగ్జరి రూమ్స్. సంప్ర: 9966600413, 9966600418 [SCA25004322]

BUSINESS SERVICES

■ మీ బంగారం ముణప్పురం ముత్తూట్, మర్వాడి షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మాడబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783417]

■ ITR / Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి: 7406393937 [IA-465]

WANTED

■ వరంగల్‌లో ఇంట్లో ఉండి పనిచేయుటకు భార్య భర్తలు కావలెను. జీతం ఇద్దరికి కలిపి 18,000/- ఉచిత రూమ్, ఉచిత కరెంట్ సంప్రదించండి. సెల్: +91 9849910111. [WA-17689]

■ ప్రముఖ కార్పొరేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ & జనరల్ మేనేజర్స్ స్త్రీ/పు కావలెను. + vrs వారికి ప్రాధాన్యత. 9866137009, 9866194585. [SCA25004708]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ. అదనపు లైను 60/- రూ. మాత్రమే 5% GST అదనము

■ కమలాపూర్‌లో గల గణేష్ టింబర్ డిపోలో పని చేయుటకు అర్జెంటుగా వర్కర్స్ కావలెను. సంప్రదించండి।। సెల్: 9440471253. [SCA25004565]

■ హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పని చేయుటకు కార్ ఎలక్ట్రిషన్స్, సూ।।వైజర్స్ (F) & కార్ వాషింగ్ చేయుటకు (M/F) వర్కర్స్ కావలెను. 7995621165, 6303776310 [WA-30]

■ పెట్రోల్‌పంప్ & రైల్వే కన్‌స్ట్రక్షన్‌లో సివిల్ వర్క్ చేయుటకు సివిల్ ఇంజనీర్, సూపర్‌వైజర్ కావలెను. ప్లేస్ AP+TG. Cell: 9989606333, 9491474143. [SCA25004568]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.